# కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక 2వ అధ్యాయము

**తత్వజ్ఞానము - దైవ మర్మముల ప్రత్యక్షత**

సహోదరులారా, నేను మీ యొద్దకు వచ్చినప్పుడు వాక్చాతుర్యముతో గాని జ్ఞానాతిశయముతో గాని
దేవుని మర్మమును మీకు ప్రకటించుచు వచ్చిన వాడను కాను. 2 నేను, యేసుక్రీస్తును అనగా, సిలువ
వేయబడిన యేసుక్రీస్తును తప్ప మరి దేనిని నేను మీ మధ్య నెరుగకుందునని నిశ్చయించుకొంటిని. 3
మరియు బలహీనత తోను భయముతోను ఎంతో వణకుతోను మీ యొద్ద నుంటిని. 4 మీ విశ్వాసము
మనుష్యుల జ్ఞానమును ఆధారము చేసికొనక, దేవుని శక్తిని ఆధారము చేసుకొనియుండవలెనని, 5 నేను
మాటలాడినను సువార్త ప్రకటించినను జ్ఞానయుక్తమగు తియ్యని మాటలను వినియోగింపక, పరిశుద్ధాత్మయు,
దేవుని శక్తియు, కనుపరచు దృష్టాంతములనే వినియోగించితిని. 6 పరిపూర్ణులైన వారి మధ్య జ్ఞానమును
బోధించుచున్నాము. అది ఈ లోకజ్ఞానము కాదు. నిరర్థకులై పోవుచున్న ఈ లోకాధికారుల జ్ఞానమును
కాదుగాని, 7 దేవుని జ్ఞానము మర్మమైనట్టుగా బోధించుచున్నాము. ఈ జ్ఞానము మరుగై యుండెను.
జగదుత్పత్తికి ముందుగానే, దీనిని దేవుడు మన మహిమ నిమిత్తము నియమించెను. 8 అది లోకాధికారులలో
ఎవనికిని తెలియదు, అది వారికి తెలిసియుండిన యెడల మహిమాస్వరూపియగు ప్రభువును సిలువ వేయక
పోయి యుందురు. 9 ఇందును గూర్చి- దేవుడు తన్ను ప్రేమించువారి కొరకు ఏమి సిద్ధపరచెనో అవి కంటికి
కనబడలేదు, చెవికి వినబడలేదు, మనుష్య హృదయమునకు గోచరము కాలేదు అని వ్రాయబడియున్నది. 10
మనకైతే దేవుడు వాటిని తన ఆత్మ మూలన బయలుపరచి యున్నాడు. ఆ ఆత్మ అన్నిటిని, దేవుని మర్మములను
కూడా పరిశోధించుచున్నాడు. 11 ఒక మనుష్యుని సంగతులు అతనిలో ఉన్న మనుష్యాత్మకే గాని
మనుష్యులలో మరి ఎవనికి తెలియును? ఆలాగే దేవుని సంగతులు దేవుని ఆత్మకే గాని మరిఎవనికినీ
తెలియవు. 12 దేవుని మూలన మనకు దయచేయబడిన వాటిని తెలిసికొనుటకై, మనము లౌకికాత్మను కాక,
దేవుని యొద్ద నుండలువచ్చు ఆత్మను పొందియున్నాము. 13 మనుష్య జ్ఞానము నేర్పు మాటలతో గాక ఆత్మ
సంబంధమైన సంగతులను ఆత్మ సంబంధమైన సంగతులతో సరిచూచుచు, ఆత్మ నేర్పు మాటలతో వీటిని
గూర్చియే మేము బోధించుచున్నాము. 14 ప్రకృతి సంబంధియైన మనుష్యుడు దేవుని ఆత్మ విషయములను
అంగీకరింపడు అవి అతనికి వెర్రితనముగా ఉన్నవి. అవి ఆత్మానుభవము చేతనే వివేచింపదగును గనుక
అతడు వాటిని గ్రహింపజాలడు. 15 ఆత్మ సంబంధియైనవాడు అన్నిటిని వివేచించును గాని అతడెవని
చేతనైనను వివేచింపబడడు. 16 ప్రభువు మనస్సును ఎరిగి ఆయనకు బోధింపగలవాడెవడు? మనమైతే క్రీస్తు
మనస్సు కలిగిన వారము.